


# ఎదవకెదవకు

అది రైల్వే ప్లాట్‌ఫారం. అక్కడ చాలా రద్దీగా వుంది. ఆ రద్దీలో మనుషులున్నారు. వాళ్ళలో ఆడవాళ్ళున్నారు, మగవాళ్ళున్నారు. వాళ్ళంతా పిల్లగా వున్నారు, పడుచుగా వున్నారు, ముసలిగా వున్నారు. పిల్లాళ్ళ కళ్ళు వింతగా వున్నాయి, ఆశగా వున్నాయి. పడుచు వాళ్ళ కోర్కెలు దోరగా వున్నాయి. దొంగగా వున్నాయి. ముసలాళ్ళ మొహాలు దిగులుగా వున్నాయి, అనుభవంతో వున్నాయి.

ఇంకా అక్కడ దుకాణాలున్నాయి. వాటిల్లో కాఫీ లున్నాయి, ఖర్జూరా లున్నాయి, పళ్ళున్నాయి, పుస్తకాలున్నాయి, బిస్కత్తులున్నాయి, బరాణీ లున్నాయి. అంతేకాకుండా అక్కడ జంతువులూ వున్నాయి. వాటిలో సాధువుల్లాటి ఆవులున్నాయి. విశ్వాసం చూపే కుక్కలున్నాయి.

అందుకే అక్కడ చాలా రద్దీగా వుంది. ఆ జనంలో ఆ దుకాణాల కెదురుగా ఆ జంతువుల పక్కనుంచున్నాడొక మధ్యకాలపు మగాడు. మధ్యతరగతి ఆసామి. ఆసామి పేరు అప్పారావు.

అప్పారావు బలంగా లేడు.

పొడుగ్గా లేడు.

గొప్పగా లేడు.

గొప్పగా లేని అప్పారావు జేబులో రెండు రూపాయిల ముప్పావలా కంటె ఎక్కువలేదు. అతనా సాయంత్రమే బండి దిగాడు. ఐతే దిగి చాలా సేపయింది. తోటి వాళ్ళంతా తన్నిడిచి వెళ్ళిపోయారు.

తన దగ్గర సామానుంది. వాటిల్లో ఒక ట్రంకుపెట్టె, ఒక సంచె, ఒక చెరుకుముక్కల కట్ట!

జేబులో చెయ్యిపెట్టి డబ్బులు తీసాడు. లెఖ్ఖ చూసుకున్నాడు. ఒక పావలా, మూడర్ధ బిళ్లలు, చివరగా ఒక రూపాయినోటు, సింపిల్‌గా ఏంచక్కా రెండుమ్ముప్పావలాయే!

గొణుక్కున్నాడు. సొనుక్కున్నాడు. చిరాకు పడ్డాడు—తన దగ్గరంతే వున్నందుకు, ఎవరు మిచ్చి నేర్చుకోనందుకు.


బండి దిగి పది నిముషాలు ఎప్పుడో గడిచింది. పది నిమషాల్లో పదిమంది కూలీల్ని పలకరించాడు. పరామర్శించేడు. చివరకు పొమ్మన్నాడు.

అందరికీ దురాశే! వెధవలు!? చీల్చియాలి చెండాడేయాలి చెరిగీయాలి. విసుక్కున్నాడు.

సామాను మోసుకుని రిక్షా వద్దకు పోలేడు. వాటి బరువెక్కువ. అత్తారింటి నుంచొచ్చిన

---

పతివాడ మార్కండేయులు ★ కెజియాగ్రాంధ



సరుసలవి. ఎవడూ రూపాయికి తక్కువకు మొయ్యడు. పోనీ మోయించిస్తే? అమ్మో! ఇక మిగిలేది రూపాయి ముప్పావలా, ఇల్లు చేరుకోవాలంటే కనీసం ఉండాలి రెండు రూపాయిలు.

ఎలా! ఎలా!! ఎలా!!!

తల తిరిగింది. దుఃఖం వచ్చింది. అంతలో మరో రైలొచ్చింది.

సామాను చూసుకున్నాడు. జేబులో డబ్బును తలచుకున్నాడు. బేరీజు వేసుకున్నాడు.

ఆ వొచ్చిన రైల్లోంచి జనం దిగేరు. దిగిన వాళ్ళు ఆగకుండా వెళ్ళిపోయారు-తన సామాను మీంచి, తనను తప్పించుకుంటూ, కాళ్ళు తొక్కేస్తూ!

ఆ చెత్తలో, ఆ దుకాణాల కెదురుగా, జంతువులకు దూరంగా, తర్వాతి బండికోసం కళ్ళు గేలాలుగా చేస్తున్న మనుష్యుల మధ్యలో అప్పారావు అక్కడే వున్నాడు తన సామానుతో!

“బాబూ కూలిప్పించండి!”

చూసాడప్పారా వటువేపు. కుర్రాడు. పదమూడేళ్ళు కాదుకాదు పదిహేనేళ్ళ కుర్రాడు. కూలోడికి కూలోడులాగున్నాడు. నల్లగా వున్నాడు, నలిగిపోయున్నాడు. చింపిరిగా వున్నాడు. చిక్కిపోయి వున్నాడు. మురికిగా వున్నాడు. మాసిపోయి వున్నాడు. అర్థింపుగా వున్నాడు. ఆకలిగా వున్నాడు.

అనుమానం వేసిందప్పారావుకి, ‘యివన్నీ మొయ్యగలడా’ అని.

“నీ వయసెంతరా” అనడిగాడు.

“ఏమో నాకు తెల్దు!”

‘వీడికి ఆడదానికి పోలికలున్నాయి’ అనుకున్నాడు. తర్వాత అడిగాడు ఎంత కావా’లని.

“అర్ధరూపాయిప్పించండి.” కుర్రాడి నోటి నుండి కాదు, కడుపులోంచి అన్నాడు.

అప్పారావు కళ్ళు మెరిశాయి.

కూలోడు చవగ్గా కుదిరాడు.

తనకు మురిబ్బంది లేదు.

వాడి నెత్తిమీద పెట్టె పెట్టాడు. దానిమీద చెరుకుల కట్ట పెట్టాడు. సంచి తనే పట్టుకున్నాడు.

ఇప్పుడు గుండెల్నిండా గాలి పీల్చుకున్నాడు. తాపీ అయ్యాడు. సంతోషించాడు. సంతోషంలో ముందుకు నడిచాడు, జనంలోంచి.

“ఒరే కుర్రాడా!” వెనకనుంచొస్తున్న కుర్రాడ్ని పిలిచాడు.

“ఏటండి?”

“నీ పేరేట్రా?”

"అందరూ కొండయ్య అంటారండి. మా అమ్మ అలాగ పిల్చింది." వుంది.

"మరి మీయమ్మ ఎలాగ పిలుస్తాదిరా?"

"నాయినా అంటాదండి."

"మీ నాయనేమి చేస్తున్నాడ్రా?"

"లేదండి."

లేదంటే అప్పారావుకి తెల్సిపోయింది. తను తెలుసుకున్న దానికి ఎన్నో రంగులు వేసాడు. బహుశా వీడు తండ్రి గండాన పుట్టుంటాడు. వీడు పుట్టగానే ఆ తండ్రి మహాశయుడు చచ్చుంటాడు. లేదా వీడి తండ్రి వుండే వుంటాడు. వున్నా వాడు యింకో ఆడదానితో ఉండుంటాడు. కాకపోతే తాగినమత్తులో లారీ కిందపడి చచ్చుంటాడు.

అలా అనుకుంటూనే అప్పారావు మామూలుగా అడిగేసాడు—"లేదంటే?"

"యుద్ధంలో సచ్చిపోయాడండి!"

అప్పారావు సిగ్గు (బాధ) పడిపోయాడు. ఆ జవాబు విని కళ్ల బైర్లు కమ్మటం, తల తిరగటం జరగలేదు కానీ—గుండెలో చెయ్యిపెట్టి కెలికినట్టనిపించి దతనికి. నిశ్శబ్దంగా నాలుగడుగులు వేసి, "కూలెందుకు చేస్తున్నావురా?" అనడిగాడు అమాయకంగా.

"అమ్మకోసం సార్!"

బలే బలే చిత్రంగా వుంది. అందరూ కడుపుకోసం కూలి చేస్తారు. వీడు అమ్మకోసం చేస్తున్నాడు.

వీడు శివాజీ లాంటోడు.

చంద్రగుప్తుడు లాంటోడు.

పోనీ—శ్రీరాముడి లాంటోడు.

అంతకీ కాకపోతే పరశురాముడి లాంటోడు.

హిస్టరీని వల్లించుకున్నాడు. ఒక్కొక్క హీరోని కుర్రాడి పక్కనపెట్టి చూశాడు. అతనికెందుకో తన సిమిలీలు తనకే నచ్చలేదు.

"మాకు దిక్కెవరు లేరండి. మా అమ్మ, నేను, యిద్దరు సెల్లెల్లు, ఒక తమ్ముడు మేము మొత్తం ఐదుగురం. ఐదు రోజుల నుంచీ అమ్మకు జొరంగుంది. ఐదు పూటలయింది మేము తిండి తిని. కారీజులు మోసి, అందులో మిగిలింది తెచ్చి మమ్మల్ని పెంచుతుంది అమ్మ. అమ్మకు జొరం వొచ్చింది. కారీజులకు వెళ్ళలేదు. మాకు తిండి లేదు. అమ్మకు మందు లేదు. ఇయ్యాల కూలిచేసి అమ్మకు మందు కొంటాను. ముక్కల రొట్టె కొంటాను."

కుర్రాడి బాధలకు అప్పారావు అదిరిపడ్డాడు. ప్లాట్ఫాం మీద తన సామాను కదలకపోయినందుకు తనుపడ్డ బాధకంటె యిది చాలా విషాదంగా వుంది. వాడిమీద జాలిపడ్డాడు.

పిటీ! పిటీ!! పిటీ!!!

గేటులో టికెట్టిచ్చి నాలుగడుగులు నడిచి బయటపడ్డా రిద్దరూ.

ఎదురుగా రిక్షా!

బేరమాడేడు. రెండు రూపాయలకు తెగింది. వెంటనే సామాను రిక్షాలోకి వెళ్ళింది. తనూ వెళ్ళి కూర్చున్నాడు. జేబులో చెయ్యిపెట్టి కుర్రాడి మొహంలోకి చూసి, మరొకసారి జాలిపడ్డాడు. పావు నిమిషం ఆలోచించాడు. అర్ధకు బదులు లెక్కప్రకారం మిగిలిన ముప్పావలాను వాడి చేతిలో పెట్టాడు.

కుర్రాడి మొహం విప్పారింది.

కళ్ళు కృతజ్ఞతలు చెప్పాయి.

పెదవులమీది చిరునవ్వులు సంగీత సౌరభాలను వెదజల్లాయి.

రిక్షా సర్దుకుని కదలబోయింది.

ఇంతలో—

"ఓరి దొంగ గుంటడా! మా కడుపులు కొట్టేదానికి నువ్వొక కొత్తోడివి తయారయినావేట్రా! ఇక్కడ లైసెన్స్‌లు కట్టుకుని, యూనీఫారము బట్టలేసుకుని, బరువులు మోసుకుని మాము బతుకుతుంటె, మా బతుకులు సల్లార్చేదానికి బయిలెల్లినావేటి?"

అంటూ ఓ లైసెన్స్ కూలీ గబగబ పరుగెత్తుకుంటూ వచ్చి కొండయ్య చేతిలోనున్న ముప్పావలా నులిపి లాక్కున్నాడు.

అక్కడ కూలీ చేయడానికి కొండయ్యకు లైసెన్స్ లేదు!

* * *

సరిగ్గా అప్పుడే స్టేడియం మైదానంలో వేలాది ప్రజలముందు ఓ కవి గొంతెత్తి పాడుతున్నాడు—

దీనులార
హీనులార
బాధాసర్ప దష్టులార
ఏడవకం డేడవకండి! □